ఇవి రోడ్లేనండోయ్..!

సంక్రాంతి పండుగకు బయటి ప్రాంతాల నుంచి సొంత గ్రామాలకు వచ్చే అల్లుళ్లు ఇక్కడున్న రోడ్లను చూసి ఆనందపడేలా రూపురేఖలు మారుస్తామని సీఎం చంద్రబాబు గత సంక్రాంతికి ముందు ఆర్భాటంగా ప్రకటించారు. అయితే ఆయన చెప్పిన మాటలకు, చేతలకు పొంతనే లేదని ప్రస్తుతం దుస్థితిలో ఉన్న రోడ్లు చెప్పకనే చెబుతున్నాయి. నియోజకవర్గంలో గుంతలమయమైన రోడ్లు, బాగుపడని రోడ్ల దుస్థితిని చూసి కూటమి ప్రభుత్వం చెప్పిన మాటేమిటి? ఇక్కడ ఉన్న పరిస్థితేమిటని జనం మండిపడుతున్నారు.

- మొక్కుబడిగా ప్యాచ్‌పనులు
- పలు రోడ్లకు ఇప్పటికీ తప్పని గుంతలు
- ప్రజలకు అగచాట్లు


బైరెడ్డిపల్లె: గుంతలు తేలిన కడపనత్తం రహదారి


పలమనేరు మండలంలోని కొలమాసనపల్లె-నెల్లిపట్ల రోడ్డు దుస్థితి



పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలో దాదాపు 250 కిలోమీటర్లు తారురోడ్లు ఉండగా వాటిల్లో 60శాతం రోడ్లు అధ్వానంగా మారాయి. కానీ కూటమి ప్రభుత్వం ఇక్కడ రూ.4.13కోట్లతో 6,395మీటర్ల మేర రోడ్ల మరమ్మతులకు నిధులను గతంలో కేటాయించింది. దీంతో పనులు నాసిరకంగా అంతంతమాత్రంగానే చేశారు. వాస్తవానికి కూటమి ప్రభుత్వ పాలనలో పలమనేరు నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో రోడ్లకు ప్యాచ్‌వర్కులు మొక్కుబడిగా చేయడంతో అవి ఎప్పుడో దెబ్బతిన్నాయి.

నెల్లిపట్ల రోడ్డును చూడండి సారూ..!

పలమనేరు నియోజకవర్గంలో రహదారులు పరిస్థితి ఎంత ఘోరంగా తయారైందో చూడాలంటే కొలమాసనపల్లె-నెల్లిపట్ల రోడ్డుచూస్తే ఇట్టే అర్థమవుతుంది. ఈ మార్గంలో తారురోడ్డుకు ఇరువైపులా రెండు అడుగుల గుంతలు కనిపిస్తున్నాయి. వాహనాలు కనీసం సైడ్‌కు దిగాలన్నా కుదరడం లేదు. ఈ మార్గంలోని విరుపాక్షపురానికి పక్షవాతానికి గురైన దేశ విదేశాలనుంచి రోగులు చికిత్స నిమిత్తం నిత్యం పెద్ద సంఖ్యలో వస్తుంటారు. వారు ఈ రోడ్డును చూసి చంద్రబాబు పాలనలో రోడ్డు ఇంత ఘోరంగా ఉందా? అని వారు తమ ప్రాంతాల్లో చెప్పుకునే పరిస్థితి ఉంది. బైరెడ్డిపల్లె మండలంలోని తమిళనాడు రాష్ట్రానికెళ్లే కడపనత్తం రోడ్డు పూర్తిగా గుంతలమయమైంది. దీంతో ఈ మార్గంలో వాహనాలు వెళ్లడం కష్టతరమైంది.పెద్దపంజాణి మండలంలోని చెన్నారెడ్డిపల్లె, అప్పినపల్లె రోడ్లు గుంతలు పడ్డాయి. నియోజకవర్గంలో సగానికి పైగా దెబ్బతిన్న రోడ్లను పట్టించుకోకుండా కొన్ని రోడ్లలో మాత్రం తూతూ మంత్రంగా రోడ్లకు మరమ్మతులు చేశారు. అయితే దీనిని విస్మరించి కూటమి నేతలు గొప్పలు చెప్పుకోవడం తప్పితే పూర్తి స్థాయిలో రోడ్ల మరమ్మతులు చేయలేదన్నది నిష్ఠుర సత్యం. ఆయా రోడ్లపై తరచూ వెళ్లే గ్రామస్తులు ఎవరిని కదిపినా చెప్పే మాట కూడా ఇదే.

నోటీస్ బోర్డు

పంచాయతీల అభివృద్ధిపై 6న శిక్షణ

పులిచెర్ల(కల్లూరు): పంచాయతీల అభివృద్ధిపై ఈ నెల 6న శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏంపీడీఓ రాజశేఖరబాబు తెలిపారు. దీనికి మండలంలోని వివిధ శాఖల మండలస్థాయి అధికారులు, మండల ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

నేడు వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠాపన

కుప్పం రూరల్: మహాకవి వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠాపన శుక్రవారం ఉదయం కంగుందిలో చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. వాల్మీకి కులస్తులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

శ్రీవారి కల్యాణోత్సవం రేపు

సదుం: మండలంలోని కొత్తపల్లె శ్రీవారి పాదక్షేత్రంలో శనివారం 4వ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. వివిధ వైదిక కార్యక్రమాల అనంతరం ఉదయం 11 గంటలకు కల్యాణోత్సవం, సాయంత్రం 4 గంటలకు కల్యాణోత్సవ విగ్రహ ఊరేగింపు ఉంటుందన్నారు.

క్లుప్తంగా

స్వామియే శరణమయ్యప్పా..!

- శబరిమలైకు పయనమైన మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ


ఇరుముడి పూజలో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ 41 రోజుల అయ్యప్పదీక్ష చేసి స్థానిక శివాలయంలో గురువారం భక్తిప్రపత్తులతో ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. నియోజక వర్గానికి చెందిన 150మందితో కలసి ప్రత్యేక బస్సుల్లో వారు శబరిమలైకు పయనమయ్యారు.

ముగిసిన అయ్యప్ప భక్తుల అన్నదానం


అన్నదాన కార్యక్రమంలో అయ్యప్పస్వామి భక్తులు

పుంగనూరు: పట్టణంలోని కోనేటి వద్ద శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 41 రోజుల అన్నదాన కార్యక్రమం గురువారం ముగిసినట్లు హరిహరసుతన్ ట్రస్ట్ నిర్వాహకులు, అయ్యప్పస్వామి భక్తులు తెలిపారు. తొలుత అయ్యప్పస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి, పూజలు చేశారు. అయ్యప్ప దీక్ష ధారణ భక్తులకు ఇన్ని రోజుల పాటు అన్నదానం చేయడం దైవ కార్యంగా ఎంచి చేసినట్టు నిర్వాహకులు చెప్పారు.

డిగ్రీ కళాశాల అభివృద్ధికి ముందుంటాం


కళాశాలలో నిర్వహిస్తున్న సీడీసీ సమావేశం

పలమనేరు: పలమనేరు శ్రీవత్ర చెన్నారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధి తాము ఎల్లవేళలా ముందుంటామని కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యురాలు, కళాశాల స్థల దాత కుటుంబీకురాలు కొలమాసనపల్లి రత్నారెడ్డి ఉద్ఘాటించారు. స్థానిక కళాశాలలో ప్రిన్సిపాల్ వెంకటేశులు అధ్యక్షతన గురువారం నిర్వహించిన కళాశాల అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. నేడు పలు రంగాల్లో ప్రపంచం దూసుకెళ్తోందన్నారు. అదే స్ఫూర్తితో విద్యార్థులు సైతం ఒక లక్ష్యం నిర్దేశించుకుని దాని సాధనకు శ్రమించాలన్నారు. కార్యక్రమంలో సీడీసీ కార్యదర్శి సీతారామయ్య, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీచర్లకు క్రీడా పోటీలు


పోటీలలో షాట్‌పుట్ విసురుతున్న టీచర్, ఆసక్తిగా చూస్తున్న ఉపాధ్యాయినులు

పుంగనూరు: ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని గురువారం పట్టణంలోని బసవరాజ ప్రభుత్వ పాఠశాలలో ఎంఈఓ నటరాజ ఆధ్వర్యంలో మహిళా టీచర్లకు క్రీడా పోటీలు నిర్వహించారు. పరుగుపందెం, స్లో వాకింగ్, మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్, త్రోబాల్, టెన్నికాయిట్, షాట్‌పుట్, షటిల్ తదితర పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ మధుసూదనరెడ్డి, ఎంపీడీఓ లీలా మాధవి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ఎంఈవో తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాణి, ఉపాధ్యాయినులు రాజేశ్వరి, దీపారాణి, రేవతి, సుధారాణి, విజయశ్రీ, కళావతి, షాదియాబేగం, మంజుల, సీఆర్‌పీలు నారాయణస్వామి, అబ్దుల్ లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న రెస్కో చైర్మన్ ప్రతాప్

కుప్పం: కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ(రెస్కో) నూతన పాలక వర్గం గురువారం ప్రమాణ స్వీకారం చేసింది. కమతమూరు మాజీ సర్పంచ్ వీజీ.ప్రతాప్ చైర్మన్‌గా, మరో 13 మంది సభ్యులు ఉదయం అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేశారు. తొలుత చెరువు కట్ట నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు భారీ ర్యాలీ అనంతరం శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ దేవాలయంలో పూజలు చేశారు. ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, రాష్ట్ర ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, పీఎంకే చైర్మన్ డాక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి విస్తృత పర్యటన


రొంపిచెర్ల: బడబళ్ల వంక ప్రాజెక్టు ముంపు భూములకు పరిహారం ఇప్పించాలని కోరుతున్న రైతులు


వైఎస్సార్‌సీపీ నాయకుడు యర్రంరెడ్డి గృహ ప్రవేశంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడి


శాంతిపురం: నడింపల్లెలో చలపతి కుటుంబ సభ్యులతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సదుం/రొంపిచెర్ల/చౌడేపల్లె: సదుం, రొంపిచెర్ల, చౌడేపల్లె మండలాల్లో వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం పర్యటించారు. ఎర్రాతివారిపల్లెకు చెందిన పెద్దిరెడ్డిగారి వెంకటరమణారెడ్డి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఆయన దశదిన కర్మక్రియలకు హాజరై ఆయన చిత్రపటానికి పెద్దిరెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రొంపిచెర్ల మండలంలో యర్రంరెడ్డి గృహప్రవేశానికి హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే వైఎస్సార్ సీపీ నాయకుడు మదనమోహన్‌రెడ్డి తల్లి మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. బడబళ్ల వంక ప్రాజెక్టు ముంపు భూములకు పరిహారం మంజూరు చేయించాలని పలువురు రైతులు కోరారు. చౌడేపల్లె మండలం దిగువపల్లె పంచాయతీ సర్పంచ్ సోనియా మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి దంపతులకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఫోన్‌చేసి ఓదార్చారు. గురువారం మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి తల్లి ఎస్.చంకీ(82) మృతిచెందారు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్యే ఫోన్‌లో పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అలాగే జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, పార్టీ మండల కన్వీనర్ నాగభూషణరెడ్డి, మాజీ ఎంపీపీ రుక్మిణమ్మ, సింగిల్ విండో మాజీ చైర్మన్ రవిచంద్రారెడ్డి, పలువురు సర్పంచులు, నాయకులు చంకీ భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఆశీస్సులు

పలమనేరు: పట్టణానికి చెందిన రవికుమార్తె వివాహానికి మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతోపాటు తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప, మాజీ ఎమ్మెల్యేలు వెంకటేగౌడ, డాక్టర్ తిప్పేస్వామి, మాజీ ఎంపీపీ ఆర్.శ్రీనివాసులు రెడ్డి, పట్టణ కన్వీనర్ హేమంత్ కుమార్‌రెడ్డి, నియోజకవర్గానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డికి ఘన స్వాగతం

వి.కోట: పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం ఘనస్వాగతం పలికారు. కుప్పంలో శుభకార్యానికి హాజరయ్యేందుకు వెళ్తున్న ఆయనకు వి.కోటలో నాయకులు స్వాగతం పలికి ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్.నాగరాజు, మండల యూత్ అధ్యక్షుడు పవన్, కుమార్ రాజా, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీస్సులు

శాంతిపురం: వైఎస్ఆర్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, ఎంపీపీ వసుంధరల కుమారుడి వివాహ రిసెప్షన్‌కు గురువారం రాత్రి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరై నూతన వధూవరులు వివేక్‌రెడ్డి, లిఖితరెడ్డిలను ఆశీర్వదించారు. అంతకు ముందు నియోజకవర్గ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్దాయనకు రాజుపేటరోడ్డు వద్ద ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి నడింపల్లెలో మండల పార్టీ కార్యదర్శి చలపతి ఇంటికి వెళ్లి ఇటీవల వివాహమైన ఆయన బావమరిది సుబ్రమణ్యం, శిల్పను ఆశీర్వదించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ భరత్, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, మాజీ ఎంపీ రెడ్డెప్ప, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు మొగసాల రెడ్డెప్ప, మొగసాల కృష్ణమూర్తి, రెస్కో మాజీ చైర్మన్లు చక్రపాణిరెడ్డి, సెంధిల్‌కుమార్, స్థానిక జెడ్పీటీసీ శ్రీనివాసులు, నియోజకవర్గంలోని వివిధ మండలాల కన్వీనర్లు విజలాపురం బాబు, మురుగేష్, హఫీజ్, బుల్లెట్ దండపాణి, కుప్పం ఎంపీపీ అశ్వని, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ సమాజ నిర్మాతలు గురువులే


పెద్దపంజాణి: సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న టీచర్లు


సదుం: ఆటల పోటీల్లో తలపడిన టీచర్లు

పెద్దపంజాణి: మండలంలోని పెద్దపంజాణి ప్రాథమిక పాఠశాలలో గురువారం ముందస్తుగా ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి హెచ్‌ఎం బాబు రెడ్డి పుష్పాంజలి ఘటించి మాట్లాడారు. ఉత్తమ సమాజ నిర్మాతలు గురువులేనని, ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నందుకు తమకెంతో గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో టీచర్లు నాగరాజు, ఇందిరా, తేజోవతి, ఫహిమున్నీసా, పీఎంసీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సదుంలో..

సదుం: స్థానిక జెడ్పీ హైస్కూల్లో గురువారం ముందస్తుగా గురుపూజోత్సవం నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఏఎస్‌ఐ సత్యనారాయణ మాట్లాడారు. అలాగే హెచ్‌ఎం సుబ్రమణ్యం, లీగల్ టీం సభ్యుడు గిరిబాబు డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆటల పోటీల్లో టీచర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు.

గాయపడిన దంపతుల్లో భర్త మృతి


మృతి చెందిన రగీన్

రొంపిచెర్ల: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దంపతుల్లో పరిస్థితి విషమించి భర్త మరణించాడు. వివరాలు.. బెంగుళూరు-తిరుపతి జాతీయ రహదారిలోని మండల సరిహద్దులో బుధవారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో అన్నమ్మయ్య జిల్లా కలకడకు చెందిన రగీన్(67), అతని భార్య నీతిమా(60) తీవ్రంగా గాయపడటం విదితమే. బండకిందపల్లె గ్రామ పంచాయతీ హనుమంతురాయుని పేటలోని సోదరుడు ఇంటికి వచ్చిన దంపతులు తిరుగు ప్రమాదంలో ప్రమాదానికి గురయ్యారు. వీరికి పీలేరులో ప్రథమ చికిత్స అనంతరం తిరుపతి రుయాకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం రగీన్ మరణించాడు. అతడి భార్య చికిత్స పొందుతోంది. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

ఎట్టకేలకు పలమనేరు ఏఎంసీ చైర్మన్ నియామకం

- ఆలకుప్పం రాజన్నకు దక్కిన పదవి

పలమనేరు: పలమనేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ గిరిపై ఉత్కంఠ వీడింది. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 18 ఏఎంసీలకు కూటమి ప్రభుత్వం గురువారం చైర్మన్లు నియమించింది. పలమనేరు ఏఎంసీ చైర్మన్ పదవి గంగవరం మండలానికి చెందిన ఆలకుప్పం రాజన్నను (బీసీ) వరించింది. ఇటీవల ఆ పార్టీ నిర్వహించిన ఐవీఆర్‌ఎస్‌లోనూ కేవలం రాజన్న పేరు మాత్రమే రావడంతో కచ్చితంగా చైర్మన్ పదవి ఆయనకే అని తెలియవచ్చింది. నియోజకవర్గంలో వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన రాజన్నకు కుల సమీకరణల్లో భాగంగా స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి ఈ పదవిని కట్టబెట్టినట్టు తెలుస్తోంది. మరోవైపు వైస్ చైర్మన్ పోస్టును జనసేనకు ఇవ్వనున్నట్టు సమాచారం.

ఉపాధ్యాయులే సమాజ నిర్దేశకులు



పలమనేరు: ఉపాధ్యాయులే సమాజ మార్గ నిర్దేశకులని పట్టణానికి చెందిన సమాజ సేవకులు సీతారామయ్య అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ముందస్తుగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని సీతారామయ్య చారిటబుల్ ట్రస్టు నిర్వహించింది. 33మంది టీచర్లను సన్మానించి ఆయన మాట్లాడారు. భావి భారత పౌరులను తయారు చేయడంలో గురువుల పాత్ర ఘనమైందన్నారు. హెచ్‌ఎం షంషీర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పథకాల ఫలాలు ఎస్సీ, ఎస్టీలకు అందాలి

పుంగనూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ఎస్సీ, ఎస్టీలకు అమలు చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయికి చేరేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ బాణావత్ మునీంద్రనాయక్ కోరారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీలకు అట్రాసిటి ప్రివెన్షన్ యాక్టుపై అవగాహన సదస్సులు నిర్వహించాలని, ఎస్సీ, ఎస్టీ మహిళలు, బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడిన వారిపై పోక్సో చట్టంతో శిక్షించాలని పోలీస్ అధికారులను కోరారు. సమావేశంలో తహసీల్దార్ రాము, ఎస్ఐ హరిప్రసాద్, సర్వేయర్ శ్రీనివాసులునాయక్, సభ్యులు శ్రీనివాసులు, చిన్నప్ప, నరసింహులు, అయూబ్‌ఖాన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేలం

పలమనేరు: గతంలో స్థానిక ఎంవీఐ శాఖ తనిఖీలలో సీజ్ చేసిన రికార్డులు లేని వాహనాలను గురువారం ఎంవీఐ మధుసూదన్, ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో బహిరంగ వేలం చేశారు. మొత్తం 15 వాహనాలు వేలంలో రూ.5.66లక్షలు పలికినట్టు చెప్పారు. వాస్తవానికి మొత్తం 17 వాహనాలను వేలం వేస్తామని ముందుగా ప్రకటించిన అధికారులు 15 వాహనాలను మాత్రమే వేలం వేసి, రెండు వాహనాల గురించి సమాచారం ఇవ్వకపోవడం గమనార్హం!

ప్లాస్టిక్ కవర్ల విక్రయాలపై కేసులు



పుంగనూరు: పట్టణంలోని పలుషాపుల్లో ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో వారిపై కేసులు నమోదు చేసి జరిమానా విధించినట్లు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని పలుషాపులు షాపుల్లో తనిఖీలు చేసి ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు మొదలైన వాటిని సీజ్ చేసి, రూ.12 వేలు జరిమానా విధించారు. ఇక మీదట విక్రయాలు కొనసాగిస్తే షాపులు సీజ్ చేసి , క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని కమిషనర్ హెచ్చరించారు. దాడుల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మునివెంకటప్ప, సచివాలయ కార్యదర్శి శ్రీనివాసులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల వసతి గృహం తనిఖీ


వసతి గృహం తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ బాలాజి

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని ఎంపీడీఓ బాలాజి గురువారం ఉదయం ఆకస్మిక తనిఖీ చేశారు. అల్పాహార సమయానికి వసతి గృహంలో ఉన్న 17 మంది విద్యార్థినులను భోజనం నాణ్యత, విద్యా బోధన, హాస్టల్‌లో వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ, విద్యార్థినులు చదువుతో పాటు అన్నింటా రాణించాలని ఆకాంక్షించారు. ఇన్‌చార్జ్ వార్డెన్ దీపకుమారితో ఫోన్లో మాట్లాడారు. హాస్టల్‌లో విద్యార్థినులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. వంట గది, హాస్టల్ లోపల శుభ్రత పాటించాన్నారు. కార్యక్రమంలో పీఎస్.రెడ్డిశేఖర్, మహిళా సంరక్షణ కార్యదర్శి సమీరా పాల్గొన్నారు.

హమాలీలకు వైద్య పరీక్షలు


సదుంలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చరణ్

సదుం: మండలంలోని నడిగడ్డ సివిల్ సప్లై గొడౌన్‌లో పని చేస్తున్న హమాలీలకు చెరుకువారిపల్లె పీహెచ్‌సీ డాక్టరు చరణ్ గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సిబ్బంది నీలకంఠ, జానకి, శిఖామణి పాల్గొన్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: రొంపిచెర్ల సివిల్ సప్లయ్స్ గోడౌన్‌లో పని చేస్తున్న హమాలీలకు గురువారం పీహెచ్‌సీ వైద్యులు దినేష్ కుమార్ నాయక్ ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. హమాలీలకు, గుండె, కిడ్నీ, రక్తం, ఈసీజీ, షుగర్, బీపీ, క్రియాటిన్..తదితర వైద్య పరీక్షలు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు శిబిరం నిర్వహించి 20 మంది హమాలీలకు వైద్య పరీక్షలు చేసినట్టు ఆయన చెప్పారు. సీహెచ్‌ఓ అమ్మణ్ణి, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజ, సివిల్ సప్లయ్ డీటీ నళిని, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

పలమనేరులో..

పలమనేరు: స్థానిక పౌరసరఫరాల శాఖ గోడౌన్‌లో పనిచేసే హమాలీలకు పాతపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో డాక్టర్ సురేఖ గురువారం వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సిబ్బంది జయశంకర్, భారతి, నిరుపమ తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: స్థానిక మార్కెట్ యార్డులో హమాలీలకు పీహెచ్‌సీ డాక్టర్ కిరణ్మయి వివిధ వైద్య పరీక్షలు చేశారు. కొందరికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వారిని స్విమ్స్, రుయా ఆస్పత్రులకు తరలించనున్నట్టు చెప్పారు. గోదాం డీటీ రమేష్, డీఈఓ నాగరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బై..బై.. వినాయకా..!


పుంగనూరు: తేరువీధిలో వినాయకుడిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న దృశ్యం.


గంగవరం: భక్తుల కోలాహలం నడుమ నిమజ్జనానికి బయలుదేరిన గణనాథుడు


సదుం: నిమజ్జనంలో యువకుల కోలాహలం

పుంగనూరు: పట్టణంలో గురువారం గణేష్ నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు. వినాయకచవితికి తేరువీధి, కోనేటి వద్ద, బెస్తవీధి ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాలను డ్రమ్స్, డీజే పాటల మధ్య డ్యాన్సులు చేస్తూ, పిల్లలు, మహిళలు రంగులు చల్లుకుంటూ మేళతాళాల నడుమ నిమజ్జనం నిర్వహించారు. అలాగే, చిన్నారులు ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

సదుంలో..

సదుం: స్థానిక వాల్మీకి వీధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని గురువారం ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ప్రత్యేక పూజలు అనంతరం అన్నదానం చేశారు.

గంగవరంలో..

గంగవరం: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం వినాయకస్వామి నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. మేళతాళాలు, బాణసంచా మోత నడుమ మండపాల నుంచి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి సమీపంలోని నదులు, చెరువుల్లో నిమజ్జనం చేశారు.

పలమనేరులో..

పలమనేరు: పలమనేరులో వివిధ ప్రాంతాల నుంచి పలు వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. రంగాపురం, లింగాయత్ వీధుల్లో వినాయకుని విగ్రహాల వద్ద జరిగిన ప్రత్యేక పూజలకు స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి హాజరయ్యారు.